# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 28 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## ఉద్యోగులకు తీపికబురు

- పెండింగ్ బిల్లుల కోసం రూ.745 కోట్లు విడుదలలి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రూ.745 కోట్లను విడుదల చేసింది. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఫిబ్రవరి నెలకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేశారు.

ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తోందని అధికారులు తెలిపారు. ప్రతినెల రూ.700 కోట్లకు తగ్గకుండా పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీ మేరకు గత జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు విడుదల చేశారు. అనంతరం గత ఏడాది ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసం రూ.700 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తూ వస్తోంది. ఈ విడత విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్సులు వంటి చెల్లింపులు ఉన్నాయి. ఉద్యోగుల పెండింగ్ బకాయిల సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## లొంగిపోయిన మావోయిస్టు నేతలతో సీఎం భేటీ



- జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు
- పునరావాసంపై హామీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు పార్టీకి చెందిన పలువురు నాయకులు గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిను కలిశారు.తిప్పిరి తిరుపతి (దేవ్ జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), పుల్లూరి ప్రసాద్ (చంద్రన్న), బడే చొక్కారావు (దామోదర్), పోతుల కల్పన (సుజాతక్క), నూనె నర్సింహారెడ్డి (గంగన్న) ఈ భేటీలో పాల్గొన్నారు. గత ఏడాది పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోయి సాధారణ జీవితంలోకి రావాలని సీఎం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఆ పిలుపుకు స్పందించి లొంగుబాటు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.సమావేశానికి ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, అదనపు డీజీ (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీ సుమతి తదితరులు హాజరయ్యారు.

సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడిన దేవ్ జీ.. సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి, ఐజీ సుమతిలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సరెండర్ పాలసీపై ప్రశంసలు వ్యక్తం చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చే రివార్డు మొత్తాన్ని రూ.కోటికి పెంచాలని, ఐదు ఎకరాల భూమి కేటాయించాలని కోరినట్లు తెలిపారు. అయితే ఐదు ఎకరాల భూమి ఇవ్వడం సాధ్యం కాదని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.అయితే లొంగిపోయిన వారికి ఇల్లు, ఉద్యోగం, జీవనభృతి కల్పించేందుకు సీఎం హామీ ఇచ్చినట్లు దేవ్ జీ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలసి, అనంతరం లొంగుబాట్లపై తెలంగాణ ప్రజలకు బహిరంగ లేఖ రాస్తామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం సరైన దారి కాదని ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.

# ఢిల్లీ మద్యం పాలసీ కేసు కొట్టివేత

- కేజ్రీవాల్, సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా 23 మందికి క్లీన్‌చిట్ విచారణాధికారిపై శాఖా పరమైన విచారణకు సీబీఐ ప్రత్యేక కోర్టు ఆదేశం
- ఢిల్లీ హైకోర్టులో అప్పీలు చేస్తామన్న సీబీఐ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశ రాజధానిలో సంచలనం సృష్టించిన దిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రౌజ్ అవెన్యూ కోర్టు సీబీఐ దాఖలు చేసిన కేసును కొట్టివేసి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ను డిశ్చార్జ్ చేసింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందికి విముక్తి కల్పించింది.ఎక్సైజ్ విధానంలో ఎలాంటి కుట్ర లేదా నేరపూరిత ఉద్దేశ్యం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేసులో నిందితులను ఇరికించారని సీబీఐపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, ప్రాథమిక ఆధారాలు సమర్పించడంలో సీబీఐ విఫలమైందని పేర్కొంది.దిల్లీ మద్యం విధాన రూపకల్పనలో "సౌత్ గ్రూప్" అనే పదాన్ని ఉపయోగించడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. అలాంటి వర్గీకరణకు సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యానించింది. విధానాన్ని సంబంధిత సంస్థల ఆమోదంతోనే రూపొందించారని, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కూడా ఉందని తెలిపింది. మిగితా 4వ పేజీలో

## ఢిల్లీ అసెంబ్లీకి తక్షణ ఎన్నికలు జరపాలి




- బీజేపీకి 10 సీట్లకు మించి వస్తే రాజకీయాలకు గుడ్‌బై అంటా
- మాజీ సీఎం కేజ్రీవాల్ సవాల్

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు సత్తా ఉంటే తక్షణమే ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. బీజేపీకి 10 కంటే ఎక్కువ సీట్లు వస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు.

దిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించిన అనంతరం శుక్రవారం మీడియాతో మాట్లాడిన కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీలో బీజేపీ పాలన కారణంగా ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. "ఢిల్లీని బీజేపీ నాశనం చేసింది. అధికారం కోసం మూడు కోట్ల ప్రజలను ఇబ్బందుల్లో నెట్టారు. వాయు కాలుష్యం, యమునా నది కాలుష్యం, ధ్వంసమైన రహదారులు సహా అనేక సమస్యలు ఉన్నాయి. మీకు ధైర్యం ఉంటే మళ్లీ ఎన్నికలు జరపండి" అని మోదీకి సవాల్ విసిరారు. దేశవ్యాప్తంగా 5,000 పాఠశాలలు నిర్మించామని మోదీ చెబితే, తాను మిగితా 4వ పేజీలో

## 'కడిగిన ముత్యంలా బయటికి వచ్చాను



- న్యాయవ్యవస్థపై నమ్మకం నిలిచింది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలుకవిత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.తాను మొదటి నుంచే "కడిగిన ముత్యంలా బయటికి వస్తాను" అని తెలంగాణ ప్రజలకు చెప్పానని, అదే విధంగా బయటికి వచ్చానని తెలిపారు. తనపై నమోదు చేసిన కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమని ఎన్నోసార్లు వెల్లడించానని, మిగితా 4వ పేజీలో

## చిలుకూరు బాలాజీ ఆలయ మాజీ ప్రధాన అర్చకులు సౌందర్ రాజన్ కన్నుమూత

**90 ఏళ్ల వయసులో నివాసంలో తుదిశ్వాస.. సీఎం రేవంత్ రెడ్డి సంతాపం**




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చిలుకూరు బాలాజీ దేవాలయం మాజీ ప్రధాన అర్చకులు సౌందర్ రాజన్ (90) శుక్రవారం కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చిలుకూరులోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, ప్రస్తుతం ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్న రంగరాజన్ ధృవీకరించారు. ఆలయానికి ఆయన అందించిన విశేష సేవలను స్మరించుకుంటూ భక్తులు, శ్రేయోభిలాషులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక చైతన్య విస్తరణకు సౌందర్ రాజన్ చేసిన కృషి అపారమని పలువురు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సౌందర్ రాజన్ మరణంపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక సేవలతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్, రిజిస్ట్రార్‌గా విశిష్ట ఖ్యాతి గడించారని సీఎం పేర్కొన్నారు. చిలుకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.దివంగతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో ధైర్యం, మనోబలం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, అభిమానులకు తన హృదయపూర్వక సానుభూతి తెలిపారు.

## దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి
- మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖపై సీఎం సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై సీఎం పలు సూచనలు చేశారు. నగరంలో శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు గుర్తించిన ప్రదేశాల్లోనే చెత్త వేయాలనే అవగాహన ప్రజల్లో కల్పించాలని సూచించారు. పనులను సమయానికి పూర్తి చేసేందుకు అవసరమైతే ఆధునిక సాంకేతికతను వినియోగించాలని సూచించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న ప్రతి స్ట్రీట్ లైట్‌కు ప్రత్యేక నెంబర్ కేటాయించి డ్యాష్‌బోర్డ్‌కు అనుసంధానం చేయాలని, టెక్నాలజీ సహాయంతో సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

CURE పరిధిలో ఫుడ్ సేఫ్టీకి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. హోటళ్ల కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. హోటళ్లకు రేటింగ్, సర్టిఫికేట్ ఇవ్వే విధానాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని సూచించారు.

నగరంలోని సిగ్నల్ జంక్షన్లు, సర్కిల్స్ వద్ద వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించాలని సీఎం సూచించారు. ఇందుకోసం ముందుగా కొన్ని ప్రాంతాలను గుర్తించి పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయాలని ఆదేశించారు. నగర అభివృద్ధిలో సాంకేతికత వినియోగంతో సమర్థవంతమైన సేవలు అందించాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కేపీహెచ్‌బీలో గజం రూ.2.65 లక్షలు

- 1400 ఎస్‌ఎఫ్‌టి ఫ్లాట్ రూ.1.10 కోట్లు
- హౌసింగ్ బోర్డు వేలంలో రికార్డు ధరలు
- వేలం ద్వారా మొత్తం రూ.24.26 కోట్ల ఆదాయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో హౌసింగ్ బోర్డు స్థలాలు, ఫ్లాట్లు మరోసారి రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. వివాదరహిత స్థలాలు, అన్ని వసతులతో అభివృద్ధి చెందిన ప్రాంతం కావడంతో బహిరంగ వేలంలో కొనుగోలుదారులు భారీగా పోటీ పడ్డారు.

ఫేజ్-1, ఫేజ్-2లోని ధర్మారెడ్డి కాలనీలో 4 ఓపెన్ ప్లాట్లు, ఫేజ్-15లోని సంపూర్ణం అపార్ట్‌మెంట్లో 8 ఫ్లాట్లకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 40 మంది కొనుగోలుదారులు ఈ వేలంలో పాల్గొన్నారు.ఎల్ఐజీ కేటగిరీకి చెందిన ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ.1.30 లక్షలుగా నిర్ణయించగా, ఒక ప్లాట్ గజం రూ.2.65 లక్షలకు అమ్ముడైంది. మరో ప్లాట్ గజం రూ.2.41 లక్షలకు విక్రయమైంది. ఫ్లాట్లకు అప్‌సెట్ ధరగా రూ.90 లక్షలు నిర్ణయించగా, 1400 ఎస్ఎఫ్‌టి ఫ్లాట్ గరిష్ఠంగా రూ.1.10 కోట్లకు అమ్ముడైంది. ఇతర ఫ్లాట్లు రూ.1.08 కోట్లు, రూ.1.07 కోట్లు, రూ.1.06 కోట్లకు కొనుగోలు అయ్యాయి.

హౌసింగ్ బోర్డు వైస్‌చైర్మన్ వి.పి. గౌతమ్ వివరాల ప్రకారం, ఈ వేలం ద్వారా మొత్తం రూ.24.26 కోట్ల ఆదాయం లభించింది. ఇందులో ఓపెన్ ప్లాట్ల ద్వారా రూ.15.81 కోట్లు, ఫ్లాట్ల ద్వారా రూ.8.45 కోట్లు సమకూరాయి. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన వేలంలో కొనుగోలుదారులు తమకు నచ్చిన స్థలాలు, ఫ్లాట్ల కోసం తీవ్రంగా పోటీ పడ్డారని అధికారులు తెలిపారు.

## అవినీతి-అరాచకమే కాంగ్రెస్ పాలన జోడెడ్లు



- ప్రజల విశ్వాసం గులాబీ జెండాపైనే
- నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రానికి కావాలి.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సన్మానం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆలంపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన కౌన్సిలర్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తదితర ముఖ్య నేతలు పాల్గొనున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్‌పైనే ఉందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు.

కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని ఆయన విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## దేశాభివృద్ధికి పరిశ్రమలు ముందుకు రావాలి

- బడ్జెట్ తక్షణ అమలుపై దృష్టి పెట్టాలి
- ప్రధాని మోడీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఆవిష్కరణలతో ముందుకు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్యంగా సాంకేతికత, సంస్కరణలు, ఆర్థిక వ్యవస్థ అంశాలపై నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ఆయన ప్రసంగించారు.


ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని ప్రధాని పేర్కొన్నారు. కాగితంపై ఉన్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా సాకారం కావాలని సూచించారు. గత దశాబ్దంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. 11 ఏళ్ల క్రితం రూ.2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు 2026-27 బడ్జెట్‌లో రూ.12 లక్షల కోట్లకు పైగా పెరిగాయని వివరించారు. ఈ భారీ కేటాయింపులు ప్రైవేట్ రంగానికి స్పష్టమైన సంకేతమని పేర్కొన్నారు.బడ్జెట్‌పై చర్చలకంటే దాని తక్షణ అమలుపై దృష్టి పెట్టాలని వాటాదారులను కోరారు. బడ్జెట్‌ను స్వల్పకాలిక వ్యాపార పత్రంగా కాకుండా విధానపరమైన మార్గదర్శిగా చూడాలని సూచించారు. మౌలిక సదుపాయాల విస్తరణ, రుణాల లభ్యత సరళీకరణ, వాణిజ్య సౌలభ్యం, పాలనలో పారదర్శకత పెంపు వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని అన్నారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావని లక్ష్యంగా ప్రతి బడ్జెట్ ఒక ముందడుగు కావాలని ప్రధాని స్పష్టం చేశారు. దేశ నిర్మాణం నిరంతర ప్రక్రియ అని, ప్రతి సంస్కరణ దీర్ఘకాలిక దృష్టితోనే అమలు కావాలని పేర్కొన్నారు.

ఆర్థిక రంగ సంస్కరణలపై కూడా ప్రధాని మోదీ దృష్టి సారించారు. దీర్ఘకాలిక వృద్ధి కోసం బాండ్ మార్కెట్లను మరింత చురుకుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాండ్ల కొనుగోలు, అమ్మక ప్రక్రియలను సులభతరం చేస్తున్నామని వెల్లడించారు. విదేశీ పెట్టుబడులకు అనుకూలమైన చట్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం కోసం 'రిఫార్మ్ పార్టనర్‌షిప్ చార్టర్' రూపొందించాలని ప్రతిపాదించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యావేత్తలు లేని కమిటీతో కొత్త విధానం ఎలా?

- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్ నివేదికపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. 'ఎక్స్' వేదికగా ఆయన ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అసలు విద్యావేత్తలే లేని కమిటీని ఏర్పాటు చేసి, వారితో విద్యా విధానంపై నివేదిక తీసుకోవడం ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి తీరుకు ఉదాహరణ అని అన్నారు. విద్యా కమిషన్‌లో స్కూల్, కాలేజీ, యూనివర్సిటీ స్థాయిలో బోధనా అనుభవం ఉన్న నిపుణులు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు.

జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ నేపథ్యం ఉన్న ఇద్దరు ప్రొఫెసర్లు మినహా, ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ చేసినవారు కానీ, స్కూల్ సిలబస్ రూపకల్పనలో అనుభవం ఉన్నవారు కానీ కమిటీలో లేరని పేర్కొన్నారు. కమిటీ చైర్మన్ ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఇంజనీర్ అని తెలిపారు. పరిపాలనా అనుభవం ఉండటం వేరు, విద్యార్థుల మనస్తత్వం, బోధనా పద్ధతులపై అవగాహన వేరు అని వ్యాఖ్యానించారు.లక్షలాది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే విద్యా కమిషన్‌లో అనుభవం గల ఉపాధ్యాయులు, చైల్డ్ సైకాలజిస్టులు, సబ్జెక్ట్ నిపుణులు

## పాక్--అఫ్గాన్ మధ్య యుద్ధం

- పరస్పర వైమానిక దాడులు
- భారీగా మృతుల సంఖ్య



**బలగం టీవీ, ఇస్లామాబాద్**

పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ దేశాలు మరోసారి ఘర్షణకు దిగాయి. ఇరు పక్షాలు పరస్పరం వైమానిక, భూదాడులు జరిపినట్లు ప్రకటించాయి. మృతుల సంఖ్యపై రెండు దేశాలు విభిన్న ప్రకటనలు చేయడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది.అఫ్గాన్ తాలిబన్ దళాలు 55 మంది పాకిస్థానీ సైనికులను హతమార్చినట్లు ప్రకటించగా, పాక్ సైన్యం 133 మంది తాలిబన్లను మట్టుబెట్టినట్లు వెల్లడించింది. తమవైపు కేవలం ఇద్దరు సైనికులు మాత్రమే మృతిచెందారని, ముగ్గురు గాయపడ్డారని పాక్ తెలిపింది.

**19 పోస్టులు ధ్వంసం: అఫ్గాన్**

గత ఆదివారం పాక్ వైమానిక దాడులకు ప్రతీకారంగా గురువారం రాత్రి అఫ్గాన్ దళాలు సరిహద్దులోని పాక్ మిలిటరీ స్థావరాలపై దాడి చేసినట్లు ప్రకటించాయి. నాలుగు గంటల పాటు కొనసాగిన ఆపరేషన్‌లో 19 సైనిక పోస్టులు, 2 స్థావరాలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నాయి. కొందరు పాక్ సైనికులను సజీవంగా తమ దేశంలోకి తీసుకువచ్చినట్లు కూడా వెల్లడించాయి. అఫ్గాన్ దాడులకు ప్రతీకారంగా పాక్ సైన్యం అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్తో పాటు చిత్రాల్, ఖైబర్, మొహమ్మద్, కుర్రం, బజౌర్ సెక్టార్లలో వైమానిక దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. ఈ ఆపరేషన్‌కు 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్' అని పేరు పెట్టినట్లు వెల్లడించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దేశ రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మిగితా 4వ పేజీలో

## అవయవదానంతో నలుగురికి పునర్జన్మనిచ్చిన బాలింత

**బలగం టీవీ, అసిఫాబాద్**

బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ అయిన 23 రోజుల బాలింత మృతి చెందింది. అయితే అవయవదానంతో మరో నలుగురికి ప్రాణాలు అందించి తల్లి మనసు చాటుకుంది. ఈ హృదయ విదారక ఘటన అసిఫాబాద్ జిల్లా జన్కాపూర్‌లో చోటుచేసుకుంది.

కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, జన్కాపూర్‌కు చెందిన గుండ నాగరాజ్‌కు 2018లో సృజన (34)తో వివాహమైంది. వీరికి అద్విక్ అనే ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల 23 రోజుల క్రితం మరో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఉద్యోగ నిమిత్తం నాగరాజ్ దుబాయ్‌లో ఉంటున్నారు. ప్రసవం కోసం సృజనను మంచిర్యాల జిల్లా మందమర్రిలోని తల్లిగారింటికి పంపించారు. కాన్పు తర్వాత కొద్ది రోజులకే సృజనకు తీవ్ర తలనొప్పి రావడంతో అకస్మాత్తుగా స్పృహ తప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. మిగితా 4వ పేజీలో



# ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

- విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి ఎస్ఎల్‌సీ వేదిక: జీఎం గోపాల్ రెడ్డిలి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్థానిక విద్యానగర్ నారాయణ పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్ రెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీసి, వారి ప్రతిభను మెరుగుపరచేందుకు ఈ కార్యక్రమం ఒక ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు గణనీయంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలల యాజమాన్యాన్ని అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని సృజనాత్మక, వినూత్న కార్యక్రమాలతో ముందుకు వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం చైతన్య రావు, ఆర్ఐ చీటీ సత్యం రావు, ప్రిన్సిపాల్ శాంతి కిరణ్, అకాడమిక్ డీన్, వైస్ ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ వాణి స్కూల్‌లో ఘనంగా వన్ లెర్న్ డే, నేషనల్ సైన్స్ డే

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రం లోని శ్రీ వాణి హై స్కూల్ లో ఘనంగా వన్ లేర్న్ డే, నేషనల్ సైన్స్ డే నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పిల్లలు వివిధ సబ్జెక్టులకు సంబందించిన ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లలలో దాగి ఉన్నా ప్రతిభ, సృజనత్మాకత విలువలతో కూడిన విద్యా అందుతుందని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో డైరెక్టర్ గణగోని శ్రీకాంత్, ప్రిన్సిపాల్ కొయ్యడ సత్యనారాయణ,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శిల్ప, తిరుమల, లావణ్య, రాజు, రేణుక, అనిత, మౌనిక, స్వర్ణ, సుష్మ, రేష్మ, బాబు, శ్రీనివాస్ పిల్లలు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో భూకంపం..

- కోల్‌కతా సహా పశ్చిమ బెంగాల్‌లో ప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై 5.5 తీవ్రత నమోదు

**బలగం టీవీ, కోల్‌కతా**

బంగ్లాదేశ్‌ను కేంద్రంగా చేసుకుని శుక్రవారం మధ్యాహ్నం భూ ప్రకంపనలు సంభవించాయి. ఈ భూకంప ప్రభావం ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలపై పడింది. మహానగరం కోల్‌కతా సహా ఇతర ప్రాంతాల్లో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మధ్యాహ్నం 1.22 గంటలకు రిక్టర్ స్కేలుపై 5.5 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు భారత భూకంపాల పరిశోధనా కేంద్రం వెల్లడించింది. భూకంప కేంద్రం బంగ్లాదేశ్లోని సత్కీరా జిల్లాలో భూమికి సుమారు పది కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు.

ఈ ప్రాంతం కోల్‌కతాకు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉండగా, సరిహద్దు జిల్లా నార్త్ 24 పరగణాలు జిల్లాలోని టాకీ పట్టణానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో ఈ పరిసర ప్రాంతాల్లో సుమారు పది సెకండ్ల పాటు ప్రకంపనలు స్పష్టంగా అనుభూతి చెందారు. అయితే పశ్చిమ బెంగాల్‌లో ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. అప్రమత్తంగా ఉన్న అధికార యంత్రాంగం పరిస్థితిని పర్యవేక్షిస్తోంది.

## తూర్పుగోదావరిలో పరువు హత్య కలకలం

**కులాంతర వివాహంపై ఆగ్రహం.. భార్య సోదరుల చేత భర్త దారుణ హత్య**

**బలగం టీవీ, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో పరువు హత్య ఘటన కలకలం రేపింది. మండపేట మండలం పరిధిలోని వేములపల్లి గ్రామంలో ప్రేమ వివాహం చేసుకున్నాడన్న కోపంతో ఓ వ్యక్తిని అతని భార్య సోదరులే దారుణంగా హత్య చేశారు. గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వేములపల్లికి చెందిన పి.వి.వి. సూర్యప్రకాశరావు (41) స్థానికంగా వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మేడపాడు గ్రామానికి చెందిన అయినవిల్లి సంధ్య ప్రస్తుతం రాయవరంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ క్లాస్‌మేట్స్ కాగా, కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే కులాలు వేరు కావడంతో సంధ్య కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం అన్నవరంలో వివాహం చేసుకుని అనంతరం వేములపల్లిలోని సూర్యప్రకాశరావు ఇంటికి చేరుకున్నారు. పెళ్లి విషయం తెలిసిన సంధ్య సోదరులు చంద్రపాల్, గిరిబాబు తీవ్ర ఆగ్రహానికి లోనై, సూర్యప్రకాశరావును హత్య చేయాలని పథకం రచించినట్లు సమాచారం. గురువారం అర్ధరాత్రి ఇంటికి వెళ్లి సూర్యప్రకాశరావుపై విచక్షణారహితంగా దాడి చేశారు. బండరాయితో ముఖంపై బలంగా బాదడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనను గమనించిన స్థానికులు నిందితులు చంద్రపాల్, గిరిబాబును పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండపేట సీఐ, ఎస్ఐలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. కులాంతర వివాహమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# పునరుత్పాదక వరి సాగు పైలట్ ప్రాజెక్టు విజయవంతం

- ఖరీఫ్--2025లో టీడీఎఫ్ ప్రయోగం సత్ఫలితాలు
- ఖర్చు తగ్గింపు, నీటి ఆదా, నేల పునరుద్ధరణకు మార్గం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న సాగు ఖర్చులు, క్షీణిస్తున్న నేల సారానికి పరిష్కారంగా తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఖరీఫ్--2025 సీజన్‌లో అమలు చేసిన 'పునరుత్పాదక వ్యవసాయ' పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైంది.

తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం 2014--15లో సుమారు 22.7 లక్షల ఎకరాలుండగా, 2023--24 నాటికి దాదాపు 66 లక్షల ఎకరాలకు పెరిగింది. ఆహార భద్రత పరంగా ఇది విజయంగా కనిపించినప్పటికీ, నిరంతర ఏకపంట సాగు, అధిక రసాయన ఎరువుల విని యోగం, అధిక నీటిపారుదల వల్ల నేల సేంద్రీయ కార్బన్ తగ్గుదల, సూక్ష్మజీవుల వైవిధ్యం క్షీణత, నేల ఆమ్లత్వం పెరుగుదల వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే సుమారు 61 శాతం జనాభా వ్యవసాయంపైనే ఆధారపడుతోంది. పెరుగుతున్న పెట్టుబడులు, దిగుబడుల్లో స్థిరత్వం లేకపోవడం రైతులను అప్పుల బారిన పడేలా చేస్తోంది. భూగర్భ జలాలపై అధిక ఒత్తిడి కారణంగా వరి సాగు వాతావరణ మార్పులకు మరింత సున్నితంగా మారింది.ఈ నేపథ్యంలో టీడీఎఫ్ సిద్దిపేట జిల్లా పెద్ద మాసంపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాలు మరియు రాజన్న--సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ ప్రాంతాల్లో 10 మంది రైతులతో 10 ఎకరాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు చేసింది. నేల పునరుద్ధరణ, ఖర్చు తగ్గింపు, నీటి సంరక్షణ అనే మూడు ముఖ్య లక్ష్యాలపై దృష్టి సారించింది.

19 రకాల పచ్చ ఎరువు పంటలతో రూపొందించిన బహుళ పంట విధానం ఈ మోడల్‌లో కీలకంగా నిలిచింది. ధాన్యాలు, పప్పులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆకుకూరలు, ధైన్చా, సన్హెంప్ వంటి పంటలను 45--60 రోజులు పెంచి పుష్ప దశలో నేలలో కలపడం ద్వారా ఎకరాకు సుమారు 2.3 టన్నుల బయోమాస్ ఉత్పత్తి అయింది. దీంతో నేల రంధ్రాల నిర్మాణం మెరుగుపడి తేమ నిల్వ సామర్థ్యం పెరిగింది. రైజోస్ఫియర్ ప్రాంతంలో సూక్ష్మజీవుల పెరుగుదల 2--3 రెట్లు పెరిగినట్లు ప్రయోగశాల పరీక్షలు వెల్లడించాయి.

రసాయన ఎరువులు, పురుగుమందులను పూర్తిగా నిలిపివేసి, స్థానికంగా తయారు చేసిన జీవ ద్రావణాలతో సాగు చేయడంతో ఎకరాకు ?4,000--?8,000 వరకు ఖర్చు తగ్గింది. రైతుల నికర ఆదాయం ?6,000--?12,000 వరకు పెరిగినట్లు నమోదు అయింది. నీటిపారుదల చక్రాలు 28--30 సార్ల నుంచి 22 సార్లకు తగ్గి 20--25 శాతం నీటి ఆదా సాధ్యమైంది.డిజిటల్ సాంకేతికత వినియోగం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతగా నిలిచింది. ఉపగ్రహ ఆధారిత పంట ఆరోగ్య పర్యవేక్షణ, 3ఐ3 మీటర్ల స్థాయిలో ఫీల్డ్ విశ్లేషణ, ఏఐ ఆధారిత వ్యాధి ముందస్తు హెచ్చరికలతో రైతులు 7--10 రోజుల ముందుగానే పంట ఒత్తిడి, వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు తీసుకునే అవకాశం పొందారు. ఖచ్చిత నీటిపారుదల సూచనలతో నీటి వినియోగం మరింత సమర్థవంతమైంది.

"పెరుగుతున్న రసాయన వాడకాన్ని తగ్గించి, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుతూ తక్కువ ఖర్చుతో లాభదాయకమైన వరి సాగును సాధ్యం చేయడమే మా లక్ష్యం," అని టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు మట్టా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. సి.ఎస్.ఆర్ నిధులు, ప్రభుత్వ సహకారంతో ఈ మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు టీడీఎఫ్ యోచిస్తున్నట్లు వెల్లడించారు. పునరుత్పాదక వ్యవసాయం నేల జీవ వైవిధ్యాన్ని పెంచే, నీటి వినియోగాన్ని తగ్గించే, రైతు ఆదాయాన్ని స్థిరపరచే సమగ్ర విధానమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అధిక ఉత్పత్తి లక్ష్యాల నుంచి సుస్థిర ఉత్పత్తి లక్ష్యాల వైపు అడుగులు వేయాల్సిన సమయం వచ్చిందని సూచిస్తున్నారు.

# రోడ్డు సేఫ్టీ అవగాహనలో భాగంగా ఉచిత కంటి పరీక్షా శిబిరం



- హెవీ వాహన డ్రైవర్లకు పరీక్షలు, ఉచిత అద్దాల పంపిణీ

**బలగం టీవీ, సిద్దిపేట**

రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్. సాధన రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు విపంచి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ట్రైనీ ఐపీఎస్ అయేషా ప్రారంభించారు. కార్యక్రమం ఏసీపీ ట్రాఫిక్ శ్రీ యం. సుమన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ట్రాఫిక్ పోలీసు విభాగం ప్రత్యేక చొరవతో, పోలీసు శాఖ సమన్వయంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా బస్సులు, లారీలు, ఆటోలు మరియు ఇతర గూడ్స్ వాహన డ్రైవర్ల కోసం ఈ ఐ చెకప్ క్యాంప్ నిర్వహించారు.

సిద్దిపేట జిల్లాలో నేషనల్, స్టేట్ హైవేలు ఎక్కువగా ఉండటంతో రోడ్డు ప్రమాదాల నివారణలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. కంటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐపీఎస్ అయేషా మాట్లాడుతూ, రోడ్డు భద్రతలో కంటి చూపు అత్యంత కీలకమని, ముఖ్యంగా హెవీ వాహన డ్రైవర్లు నిరంతరం కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి శిబిరాలను నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందన్నారు.

ఏసీపీ ట్రాఫిక్ శ్రీ యం. సుమన్ కుమార్ మాట్లాడుతూ, డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్డుపై ప్రయాణించే ప్రజల ప్రాణాలు డ్రైవర్ల బాధ్యతలో ఉంటాయని, కాబట్టి బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని తెలిపారు. ఈ శిబిరంలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ ప్రాంతాలకు చెందిన ఆర్టీసీ డ్రైవర్లు సహా సుమారు 300 మంది డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ట్రాఫిక్ విభాగ సిబ్బంది, వైద్యులు, పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆయేషా మీరా అవశేషాలు తల్లిదండ్రులకు అప్పగింత

**బలగం టీవీ, విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘకాలంగా సీబీఐ ఆధీనంలో ఉన్న ఆమె శరీర అవశేషాలను విజయవాడలోని సీబీఐ కోర్టు ఆదేశాల మేరకు తల్లిదండ్రులకు అప్పగించారు.కోర్టు ఆవరణలో అవశేషాలు స్వీకరించిన తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ భాషా గుండెలవిసేలా రోదించగా అక్కడి వారు చలించిపోయారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం జరిగిన ఈ హత్య కేసులో ఇప్పటికీ అసలు నిందితుడు ఎవరన్నది తేలకపోవడం గమనార్హం.గతంలో ఈ కేసులో సత్యంబాబును నిందితుడిగా పేర్కొన్నప్పటికీ, కోర్టు ఆయనను నిర్దోషిగా విడుదల చేసింది. అనంతరం సీబీఐ విచారణ చేపట్టినా సరైన ఆధారాలు లభించలేదని కోర్టుకు నివేదిస్తూ కేసును మూసివేస్తున్నట్లు తెలిపింది.

తమ కుమార్తెకు న్యాయం జరగలేదని, కనీసం ఆమె అవశేషాలనైనా అప్పగించాలని తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించగా, దీనికి అనుమతి లభించింది. 2019లో శాస్త్రీయ ఆధారాల కోసం సీబీఐ రీ--పోస్ట్‌మార్టం నిర్వహించి, ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం శరీర భాగాలను భద్రపరిచింది. విచారణ ముగియడంతో అవి తిరిగి అప్పగించబడ్డాయి. అవశేషాలను స్వగ్రామం తెనాలికి తీసుకెళ్లి ఇస్లాం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోర్టు వద్ద మహిళా, మానవ హక్కుల సంఘాలు ఆందోళన చేపట్టి బాధిత కుటుంబానికి మద్దతు ప్రకటించాయి. సాక్ష్యాలను తారుమారు చేసిన అధికారులపై, అసలు నిందితులపై చర్యలు తీసుకోలేకపోవడం వ్యవస్థల వైఫల్యమని వారు విమర్శించారు.

# మత్స్య కార్మికులకు ఉపాధి కల్పించేందుకు పథకాలు..



- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- నర్సింగాపూర్ గ్రామంలో మంచి నీటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మత్స్య కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోయినపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామంలో రూ. 8 లక్షల 91 వేలతో మంచినీటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ శ్రీనివాస్, ఎన్ ఎఫ్ డీబీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కన్నప్ప, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్వీ మురుగన్, జిల్లా మత్స్య అధికారి సౌజన్యతో కలిసి ప్రారంభించారు.

చేప పిల్లల పెంపకం చేసే యూనిట్ ను ప్రారంభించారు. చేప పిల్లల ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు చేప పిల్లలకు వేసే దాణా, మందులు, చేపల వేటలో వినియోగించే వలలు, పరికరాలు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మంచినీటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఉపాధి పొందేందుకు ఎంతో ఉపయోగ పడుతుందని వివరించారు. ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్ చొప్పరి రాంచంద్రం, అధికారులు ప్రకాష్ ముత్తు, సునీల్ కుమార్, విద్యాసాగర్ రెడ్డి, రామచంద్రన్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్..

**బలగం టీవీ, వేములవాడ**



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించినారు.పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.



## ఇల్లంతకుంట మండలంలో చాపకింద నీరులా పారుతున్న ఆన్లైన్ గేమ్స్ భూతం

- ఈజీ మని ఆశతో నష్టపోతున్న యువత
- పట్టించుకోకుండా చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలో పలు గ్రామాల్లో ఆన్లైన్ గేమ్స్ భూతం చాపకింద నీరులా పాకుతుంది. మండలంలో యువకులతో పాటు పలువురు ఈజీ మనీ వస్తుందన్న ఆశతో బెట్టింగ్ లు పెట్టి నష్టపోతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. పలు గ్రామల్లో కొంతమంది యువత గేమ్స్ లో అదృష్టం తలిగి లక్షలాది రూపాయలు వచ్చి కొత్త కొత్త కార్లు, వాహనాలు కొనుగోలు చేస్తున్నారని చాలామంది ఈ విధంగా మండలంలో ధనవంతులు అయ్యారని తమకు కూడా అదృష్టం కలిసి వస్తుందన్న ఆశతో కొంతమంది యువకులు నిద్రహారాలు మని ఆన్లైన్ గేమ్స్ కు ఆకర్షతులు అవుతున్నారని బాహటంగానే అనుకుంటున్నారు. ఇక మండలంలో ఇంత జరుగుతున్న అధికార యంత్రాంగం మాత్రం తెలిసిన గానీ పట్టించుకోకుండా నిమ్మకు నిరెత్తన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఏది ఏమైనా అదృష్టం కలిసి వచ్చి ఎలాంటి హాని కలగకుండా ఉంటే పర్లేదు కానీ పెద్ద మొత్తం లో బానిసలై తీవ్రంగా నష్టపోతే కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు

# బాధ్యతగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం



- రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి.
- మద్యం సేవించి డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, ఓవర్ స్పీడ్, ర్యాష్ సెల్ ఫోన్ డ్రైవింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు.
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.
- అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ ఆలైవ్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున ఎల్లారెడ్డిపేట పోలీస్ వారి ఆధ్వర్యంలో అశ్విని హాస్పిటల్స్ సహకారంతో మండల పరిధిలోని వివిధ వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈవైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై శిబిరాన్ని ప్రారంభించి,అవసరమైన డ్రైవర్లకు ఉచిత కళ్లద్దాలు,మందులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... డ్రైవర్ల భద్రతే ప్రజల భద్రతని,ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని,ప్రతి వాహనాదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. దీర్ఘకాలం వాహనాలు నడిపే డ్రైవర్లు కంటి చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.స్పష్టమైన చూపు లేకపోవడం కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని,ద్విచక్ర వాహనం నడిపే సందర్భాల్లో తప్పక హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్,సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు అలసటగా ఉన్నప్పుడు వాహనాన్ని పక్కన ఆపి విశ్రాంతి తీసుకోవాలని, ప్రతి మూడు నెలలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని,అన్ని మండల కేంద్రాల్లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఎస్పీ అశ్విని హాస్పిటల్ యాజమాన్యానికి,డాక్టర్ అభినెయ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు రాహుల్ రెడ్డి, లక్ష్మణ్, సిబ్బంది వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.



## పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల విజయకేతనం

- 8 పతకాలతో సత్తా...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా ఫిబ్రవరి 16 నుండి 21 వరకు జరిగిన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 08 పతకాలను (04 స్వర్ణ, 04 కాంస్య) కైవసం చేసుకుని జిల్లా పోలీస్ శాఖ గర్వపడేలా చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేతలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించి, పతకాలను అందజేశారు.

ఈ క్రీడల పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు అధికారులు మరియు సిబ్బంది అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ సతీష్ 500 మీటర్స్ సింగిల్, 500 మీటర్స్ డబుల్స్ మరియు 200 మీటర్స్ సింగిల్ విభాగాల్లో ఏకంగా మూడు బంగారు పతకాలను సాధించారు. అదేవిధంగా, కానిస్టేబుల్ గంగరాజు 500 మీటర్స్ సింగిల్ మరియు డబుల్స్ విభాగాల్లో ఒక బంగారు పతకాన్ని సాధించి జిల్లా ప్రతిభను చాటారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మధుకర్ ఈ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో డీటీసీ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఏ.ఆర్.ఎస్.ఐ లు సత్యనారాయణ మరియు ఆనంద్ లు తమ విభాగంలో కాంస్య పతకాలను సాధించారు.

విజేతలను అభినందించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడలు పోలీసుల మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో మరియు పని ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గెలుపోటములు సహజమని, విజేతలు జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే పోటీల్లో పాల్గొని ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా, తమ లోపాలను

# మోకాళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయవద్దు...

- మెడికవర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



మోకాళ్ల నొప్పుల సమస్యలతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ మరియు ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ రాకేష్ సూచించారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకాళ్ల నొప్పులు ప్రస్తుతం వయోవృద్ధులకే కాకుండా యువతలో కూడా అధికంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఎక్కువసేపు నిలబడటం, అధిక బరువు, క్రీడలలో గాయాలు, కాల్షియం లోపం వంటి కారణాల వల్ల ఈ సమస్యలు వస్తాయని చెప్పారు. ప్రారంభ దశలోనే వైద్యం తీసుకుంటే శస్త్రచికిత్స అవసరం లేకుండా మందులు, ఫిజియోథెరపీ ద్వారా నయం చేసుకోవచ్చున్నారు. మోకాళ్లలో వాపు, కదిలించేటప్పుడు చప్పుళ్లు రావడం, మెట్లు ఎక్కేటప్పుడు నొప్పి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సమస్య తీవ్రమైతే ఆర్థోస్కోపీ వంటి ఆధునిక చికిత్సలతో వేగంగా కోలుకునే అవకాశముందని వివరించారు. ప్రస్తుతం మెడికవర్ ఆసుపత్రిలో ఆధునిక పరికరాలతో తల నుంచి పాదాల వరకు అన్ని రకాల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం, నియమిత వ్యాయామం, బరువు నియంత్రణతో మోకాళ్ల సమస్యలను తగ్గించుకోవచ్చని సూచించారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గునుగు పువ్వుల పుస్తకావిష్కరణ

- విద్యార్థుల ప్రతిభకు పూర్వ విద్యార్థుల ప్రోత్సాహం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "గునుగు పువ్వులు" పుస్తక ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పిట్ల ఎల్లం ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. గరిపల్లి అశోక్ కుమార్ సహా పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమానికి విచ్చేశారు. పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కో శీర్షికతో "గునుగు పువ్వులు" పుస్తకానికి రచనలు అందించారు. ఈ రచనలకు పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కాలువ రాజయ్య, ముత్యాల సురేందర్ మార్గనిర్దేశనం చేశారు.

1974-75 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు పుస్తక ముద్రణ ఖర్చును భరించడంతో పాటు పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కూడా అందజేశారు. శీర్షికలు రచించిన విద్యార్థులకు ఉపాధ్యాయురాలు పిన్నులు అందజేశారు. గ్రామ సర్పంచ్ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోలాటం నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చీకోటి సుభద్ర, పాలకవర్గ సభ్యులు, 1974 పూర్వ విద్యార్థులు ఆంజనేయులు, విష్ణు ప్రసాద్ రావు, మోహన్ రావు, దొంతిని మధుసూదన్ రావు, వంగలింగారెడ్డి, వేదం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జైత్రయాత్రతో సెమీస్‌కు ఇంగ్లండ్

- న్యూజిలాండ్‌పై

### 4 వికెట్ల తేడాతో విజయం

**బలగం టీవీ, కొలంబో**


టీ20 ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ జాతీయ క్రికెట్ జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సూపర్–8 దశలో వరుసగా మూడు విజయాలతో అజేయంగా నిలిచింది. శుక్రవారం కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టుపై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. టీమ్ సీఫెర్ట్ (35), గ్లేన్ ఫిలిప్స్ (39), ఫిన్ అలెన్ (29) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్, విల్ జాక్స్, రెహాన్ అహ్మద్ రెండేసి వికెట్లు తీశారు. లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ 19.3 ఓవర్లలో 6 వికెట్లకు 161 పరుగులు చేసింది. విల్ జాక్స్ (32 నాటౌట్), టామ్ బాంటన్ (33), హ్యారీ బ్రూక్ (26) కీలక పాత్ర పోషించారు. చివరి మూడు ఓవర్లలో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది.



చివరి 18 బంతుల్లో 43 పరుగులు అవసరమైన దశలో గ్లేన్ ఫిలిప్స్ వేసిన ఓవర్ మ్యాచ్‌ను మలుపుతిప్పింది. ఆ ఓవర్‌లో రెహాన్ అహ్మద్ సిక్సర్ బాదగా, విల్ జాక్స్ 6, 4, 4తో మొత్తం 22 పరుగులు సాధించాడు. అదే మ్యాచ్ టర్నింగ్ పాయింట్‌గా మారింది.

ఇంగ్లండ్ విజయం నేపథ్యంలో పాకిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టు సెమీస్ ఆశలు సజీవంగా ఉన్నాయి. శ్రీలంకతో జరగనున్న చివరి సూపర్–8 మ్యాచ్‌లో మెరుగైన రన్‌రేట్‌తో గెలిస్తే పాక్‌కు అవకాశాలు ఉన్నాయి. అయితే రన్‌రేట్ పరంగా న్యూజిలాండ్‌కు ఇంకా ఆధిక్యం ఉంది. సూపర్–8 దశను అజేయంగా ముగించిన ఇంగ్లండ్ సెమీస్‌లో బలమైన పోటీదారుగా నిలిచింది.



# ప్రధాని మోడీని కలిసిన విజయ్‌--రష్మిక

- హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్‌కు ఆహ్వానం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

రాజస్థాన్‌లో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్న టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి అనంతర వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతన దంపతులు దేశ ప్రధాని నరేంద్ర మోడీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సమాచారం. పెళ్లికి ముందే జరిగిన ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను తాజాగా విజయ్ బృందం విడుదల చేసింది.

ప్రధానిని కలిసి ఆశీస్సులు తీసుకున్న ఈ జంట, మార్చి 4న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో నిర్వహించనున్న తమ గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్‌కు స్వయంగా ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో జరగనున్న ఈ రిసెప్షన్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# ఢిల్లీ మద్యం పాలసీ కేసు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

**కన్నీటిపర్యంతమైన కేజ్రీవాల్**

తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన కేజ్రీవాల్ భావోద్వేగానికి లోనయ్యారు. తాను, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా నిజాయితీపరులని కోర్టు తేల్చిందన్నారు. "నేను అవినీతిపరుడిని కాదు. నిజం ఎప్పుడూ గెలుస్తుంది. భారత న్యాయవ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది" అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాజకీయ కుట్ర ఆరోపణలు చేశారు. విపక్ష నేతలను రాజకీయంగా వేధించడమే లక్ష్యమని విమర్శించారు. న్యాయవాది వివేక్ జైన్ మాట్లాడుతూ, సాక్ష్యాధారాలు పరిశీలించిన తర్వాత నిందితులపై ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేవని కోర్టు నిర్ధారించిందన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారిని అక్రమంగా ఇరికించేందుకు ప్రాసిక్యూషన్ వ్యవస్థను ఉపయోగించరాదని కోర్టు స్పష్టం చేసినట్లు తెలిపారు. సీబీఐ కేసు కొట్టివేయబడిన నేపథ్యంలో అనుబంధ ఈడీ కేసు కూడా రద్దు అయ్యే అవకాశముందని పేర్కొన్నారు.

**హైకోర్టులో సవాల్‌కు సిద్ధమైన సీబీఐ**

ఇదిలా ఉండగా, రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేస్తామని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ట్రయల్ కోర్టు దర్యాప్తులోని పలు అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈ తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




## 'ది కేరళ స్టోరీ-2'కు గ్రీన్‌సిగ్నల్

**స్టే ఎత్తివేసిన కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్**

**బలగం టీవీ, కొచ్చి**

వివాదాస్పద చిత్రం ది కేరళ స్టోరీ–2 విడుదలకు మార్గం సుగమమైంది. ఈ సినిమాపై విధించిన స్టేను కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కావాల్సి ఉంది. అయితే సినిమాలో వివాదాస్పద అంశాలున్నాయని, కేంద్ర సెన్సార్ బోర్డు పునఃపరిశీలించాలని సింగిల్ బెంచ్ ఆదేశిస్తూ స్టే విధించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ చిత్ర బృందం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను కొట్టివేసింది. దీంతో చిత్రం విడుదలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ సినిమాకు కామాఖ్య నారాయణ్ దర్శకత్వం వహించారు. రెండేళ్ల క్రితం విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి ఇది సీక్వెల్.

# 'కడిగిన ముత్యంలా బయటికి వచ్చాను

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు తీర్పుతో అది నిజమైందని పేర్కొన్నారు. ఈ కేసు కారణంగా తాను, తన కుటుంబం కొన్ని నెలల పాటు తీవ్ర క్షోభను అనుభవించామని ఆవేదన వ్యక్తం చేశారు. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు వెలువడకముందే కొందరు తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇకపై మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తానని కవిత స్పష్టం చేశారు.

మద్యం కేసులో తనపై అనవసరంగా నిందలేశారనీ, అలా నిందలేసిన వారు ఇప్పుడేమంటారు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్ పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఓటమికి లిక్కర్ పాలసీ కేసు కారణమన్నట్టుగా ఆ ట్వీట్ ఉందని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. తన అరెస్ట్ ఎన్నికల అనంతరం జరిగిందనీ, బీఆర్ఎస్ ఓటమికి ఉద్యోగాలు, ఇండ్లు ఇవ్వకపోవడం, ఉద్యమ ద్రోహులకు టికెట్లు ఇవ్వడం, అహంకారమే కారణమని అన్నారు.

కడిగిన ముత్యంలా వస్తాననీ తాను చెప్పినట్టుగానే తీర్పు వచ్చిందని ఆమె గుర్తుచేశారు. కేసును ఎదుర్కొంటున్న సమయంలో తనకు అండగా నిలిచిన తన అత్తమామలకు, భర్తకు, ఆ కుటుంబంలోని సభ్యులందరికీ కవిత ధన్యవాదాలు తెలిపారు. కష్టసమయంలో అండగా నిలిచిన తన తల్లిదండ్రులకూ ధన్యవాదాలు తెలిపారు. కోర్టు తీర్పు సంతోషం కలిగించినా, ఐదున్నర నెలలు తనను కుటుంబానికి దూరం చేశారనీ, అవమానాలు, బాధ, వ్యక్తిత్వ హననం చేశారనీ, ఆ నష్టం ఎవరు భర్తీ చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఎన్ని కోట్లు ఇచ్చినా ఆ అవమానం, సమయం తిరిగి రాదన్నారు. బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేసేలా చూస్తే ప్రజలు హర్షించరనీ, వాస్తవాలు అంగీకరించి కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. కేసును ఎదుర్కొంటున్న సమయంలో బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం తనకు సహకరించలేదనీ, బీజేపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవడంలో విఫలమైందని అన్నారు. పార్టీ స్థాపించబోయే రెండు నెలల ముందు తీర్పు రావటం తనకు ప్రకృతి ఆశీర్వాదంగా భావిస్తున్నట్టు తెలిపారు.

మద్యం కేసులో ఉన్న వారందరికి క్లీన్ చిట్ రావటాన్ని కవిత స్వాగతించారు. ఆ కేసు విషయంలో తన కుటుంబానికి అన్యాయం జరిగిందనీ, ప్రతి విచారణ సందర్భంగా కార్యకర్తలే తనకు నైతిక స్థైర్యం ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యకర్తల బలంతోనే కర్తవ్యం కోసం ముందుకెళ్తున్నట్టు చెప్పారు. తనపై కేసు బీఆర్ఎస్‌పై బీజేపీ కక్ష సాధింపు కోసం కాదా? అని ఆమె కేటీఆర్‌ను ప్రశ్నించారు. తాను జైలుకు వెళ్లాక తన కోసం బీఆర్ఎస్ పెద్ద నాయకులెవరూ నిలదీయలేదన్నారు. బతుకమ్మను ఎత్తుకుని జాతి సంస్కృతిని తెలిపిన బతుకమ్మ స్థానంలో లిక్కర్ బాటిల్ ఎత్తుకున్నట్టు బీజేపీ సోషల్ మీడియా అవమానిస్తుంటే బీఆర్ఎస్ సోషల్ మీడియా ఏమైంది? అని ప్రశ్నించారు. కోర్టు తీర్పును తమకు అనుకూలంగా మలుచుకుని పార్టీ ఓటమిని తన మెడలో వేయాలని బీఆర్ఎస్ చూస్తున్నదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ఇప్పటికైనా సమీక్షించుకుని తప్పులు ఎక్కడ జరిగాయో తెలుసుకుని ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆమె సూచించారు. బీఆర్ఎస్ మాదిరిగా తనకు సైన్యం లేదనీ, పిడికెడు మందితోనే ప్రజల పక్షాన పోరాడుతున్నట్టు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననీ, అందుకే బీజేపీ మాట్లాడిందే బీఆర్ఎస్ మాట్లాడుతున్నదని కవిత ఆరోపించారు.

## ఢిల్లీ అసెంబ్లీకి తక్షణ ఎన్నికలు జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో 500 పాఠశాలలు నిర్మించానని పేర్కొన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ, పోలీసు సంస్థలను తనపై ప్రయోగించారని ఆరోపిం చారు. "కేజ్రీవాల్‌ను ఏదీ ఆపలేడు.. చావు ఒక్కటే ఆపగలదు" అని వ్యాఖ్యానించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్పై కూడా స్పందిస్తూ, మోదీ ధైర్యం ఉంటే ట్రంప్‌కు వ్యతిరేకంగా మాట్లాడాలని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తాను మౌనంగా ఉన్నానన్న విమర్శలకు స్పందిస్తూ, "నా నిజాయితీ నిరూపితమైన తర్వాతే మాట్లాడాలని నిర్ణయించుకున్నా" అని చెప్పారు.ఈ కార్యక్రమంలో మనీష్ సిసోడియా సహా పలువురు ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## అవయవదానంతో నలుగురికి పునర్జన్మనిచ్చిన బాలింత

(మొదటి పేజీ తరువాయి)

మొదట మంచిర్యాలలో చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఐదు రోజులపాటు ఐసీయూలో చికిత్స అందించిన తర్వాత సృజన బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యులు, జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం గురించి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో దుబాయ్ నుంచి వచ్చిన భర్త నాగరాజ్ అవయవదానానికి అంగీకరించారు.సృజన ఊపిరితిత్తులు, రెండు కిడ్నీలు, కాలేయాన్ని వైద్యులు సేకరించి అవసరమైన రోగులకు అందజేశారు. దీంతో నాలుగు మంది ప్రాణాలు దక్కించుకున్నారు. అంత్యక్రియల కోసం సృజన మృతదేహాన్ని జన్నాపూర్‌కు తీసుకువచ్చారు. 23 రోజుల పసికందు, అయిదేళ్ల కుమారుడు తల్లి చితికి నిప్పు పెట్టడం గ్రామస్థులను కన్నీటి పర్యంతులను చేసింది. గ్రామస్థులతో పాటు జీవన్‌దాన్ ప్రతినిధులు, సదాశయ ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. విషాద సమయంలోనూ అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యుల మానవతా దృక్పథాన్ని అభినందించారు.

# పాక్--అఫ్గాన్ మధ్య యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి దాడికి తగిన ప్రతిస్పందన ఇస్తామని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అఫ్గాన్ తాలిబన్ ప్రభుత్వంపై బహిరంగ యుద్ధాన్ని ప్రకటించారు. తమ సహనం ముగిసిందని, ఇక మిగిలింది బహిరంగ యుద్ధమేనని వ్యాఖ్యానించారు. తాలిబన్లు ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.అఫ్గాన్ వైపు నుంచి కాబూల్, కాందహార్, పక్తియా ప్రావిన్స్‌లలో వైమానిక దాడులు జరిగినట్లు అధికారులు తెలిపారు. అఫ్గాన్ గగనతలంలోకి ప్రవేశించిన పాక్ ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే దీనిపై అధికారిక ధృవీకరణ లభించలేదు.

పాక్--అఫ్గాన్ దేశాల మధ్య సుమారు 2,611 కిలోమీటర్ల డ్యూరాండ్ సరిహద్దు ఉంది. ఈ సరిహద్దును అఫ్గానిస్థాన్ అధికారికంగా గుర్తించడం లేదు. ప్రస్తుత పరిస్థితులు ప్రాంతీయ భద్రతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని అంతర్జాతీయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.